సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 13 । జూలై । 2025



'కళ్ల కలక'లం
వర్షాకాలం కావడంతో జిల్లాలో కళ్ల కలకతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸



నేటి నుంచి వెబ్ ఆప్షన్లు
ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. 18 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చు. 8లో ▸



మైనింగ్ దెబ్బకు రోడ్లు ఛిద్రం
మైనింగ్ మాఫియాకు కైకలూరు నియోజకవర్గం కేజీఎఫ్ గనిగా మారింది. కూటమి పాలనలో మట్టి, ఇసుకను ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్ కారుపై దాడి అమానుషం



కోమటి విష్ణువర్ధన్



పెనుమాల విజయబాబు

కైకలూరు: కూటమి పాలనలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ముదినేపల్లి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ గుడివాడలో జరిగే పార్టీ కార్యక్రమానికి హాజరవుతున్న కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారు అద్దాలను పగలగొట్టి కూటమి గూండాలు బీభత్సం చేయడం అత్యంత బాధాకరమన్నారు. దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

దాడులు దేనికి సంకేతం?

దెందులూరు: కృష్ణా జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ హారికపై దాడి చేసి, దౌర్జన్యానికి పాల్పడటం దుర్మార్గపు చర్య అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయబాబు అన్నారు. శనివారం సాక్షితో ఆయన మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. కూటమి ప్రభుత్వంలో సామాన్య ప్రజానీకంతో పాటు జిల్లాస్థాయి ప్రజాప్రతినిధులకు కూడా రక్షణ లేకుండా పోయిందనే విషయాన్ని ఈ దాడి నిరూపించిందన్నారు. వెంటనే న్యాయస్థానాలు ఈ ఘటనను సుమోటోగా స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. దాడి చేసి, దౌర్జన్యానికి పాల్పడిన వారిపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించడానికి ఎంతో సమయం పట్టదని అన్నారు.

ప్రైవేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

భీమవరం: విద్యా, వైద్యరంగాలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, ఈ విధానాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆశా వర్కర్ల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ గిన్నిస్ బుక్ రికార్డు పేరుతో విద్య వైద్యరంగాలను ప్రభుత్వం నుంచి వేరు చేసే ప్రయత్నంలో భాగమే యోగా, తల్లిదండ్రుల సమావేశాలు అని విమర్శించారు. సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షుడు అంగన్‌వాడీ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు కె.బేబీ రాణి మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రసూతి సెలవులు లేకుండా పనిచేయించుకోవ డం దారుణమన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి మాట్లాడుతూ మూడేళ్లలో జిల్లాలో చేసిన పోరాటాలను వివరించారు.

భీమవరం స్టేషన్‌లో తనిఖీలు

భీమవరం: రైళ్లలో గంజాయి అక్రమ రవాణను అరికట్టాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు తెలిపారు. భీమవరం టూటౌన్ పోలీసులు, ఈగల్ టీమ్స్, రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు సంయుక్తంగా శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో భీమవరం టౌన్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి బ్యాగులను, లగేజీలను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామని భీమారావు తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు లభించలేదన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని ప్రజలను కోరారు. భీమవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్ పాల్గొన్నారు.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం



కనకాయలంక కాజ్‌వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

యలమంచిలి: గోదావరిలో వరద పెరిగితే సమర్థంగా ఎదుర్కోవడానికి అధికార యంత్రాగం సన్నద్ధంగా ఉందని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. గోదావరిలో నీరు పెరుగుతున్న నేపథ్యంలో శనివారం ఆయన మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. కనకాయలంకలో కాజ్‌వే కింద నుంచి వరద నీరు పాక్షికంగా ప్రవహిస్తుండటంతో గ్రామస్తులను అప్రమత్తం చేశారు. వరద పెరిగితే ఇంజన్ పడవలు ఏర్పాటు చేస్తామని, ప్రజలు నిత్యావసరాలను ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు. కనకాయలంక, పెదలంకలో ప్రజలను అప్రమత్తం చేసేలా టాంటాం వేయించాలని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్‌ను ఆదేశించారు.

ఉధృతంగా గోదావరి

- 7.43 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల
- వేలేరుపాడు, కుక్కునూరులో పునరావాస కేంద్రాలు
- నిలకడగా శబరి, గోదావరి
- రెండు రోజుల్లో వరద తగ్గుముఖం పట్టే అవకాశం
- నీటమునిగిన ఎద్దులవాగు, గుండేటివాగు వంతెనలు
- వేలేరుపాడులో 18 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



యడవల్లి వద్ద ఎద్దులవాగు వంతెన నీటమునగడంతో పడవలో రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరికి వరద పోటెత్తుతోంది. పూర్తి జలకళతో గోదావరి, శబరి నదులు ప్రవహిస్తున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా కురిసిన వర్షాలతో లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతుంది. ముంపు మండలాలైన ఏజెన్సీ గ్రామాలను అతలాకుతలం చేస్తూ పోలవరం నుంచి ధవళేశ్వరం మీదుగా లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి పోలవరం ప్రాజెక్టు నుంచి 7,43,222 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. మరోవైపు మండలాల్లోని మూడు గ్రామాలకు చెందిన ప్రజలను పునారావాస కేంద్రాలకు తరలించారు.

ముంపు మండలాల్లో హైఅలర్ట్

గోదావరికి వరద ఉధృతి కొనసాగుతున్న క్రమంలో ముంపు మండలాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. మహారాష్ట్ర, తెలంగాణలో విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరికి పది రోజులుగా భారీగా వరద నీరు చేరుతుంది. ఈనెల 2 నుంచి ప్రారంభమైన వరద నీరు శుక్రవారం 5,02,478 క్యూసెక్కులు, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 7,43,222 క్యూసెక్కులు నీరు పోలవరానికి చేరింది. భద్రాచలం వద్ద 41.30 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుంది. మరోవైపు ఆదివారం, సోమవారం గోదావరి నిలకడగా కొనసాగే అవకాశం ఉందని, ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టడంతో తీవ్రత కొంత తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈనెల 2 నుంచి శనివారం వరకు 30.52 లక్షల క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుంచి పోలవరానికి చేరుకుంది. పోలవరం నుండి దిగువకు విడుదల చేశారు.

పోలవరంలో క్రమేపీ పెరుగుతూ..

పోలవరం రూరల్: గోదావరి వరద క్రమేపీ పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఉప నదుల నీరు చేరడంతో వరద ప్రవాహం పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 31.430 మీటర్లకు నీటిమట్టం చేరుకుంది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 7,43,222 క్యూసెక్కుల నీరు దిగువకు చేరుతోంది. అయితే భద్రాచలం వద్ద శనివారం ఉదయం 11 గంటలకు 41.30 అడుగులకు చేరుకున్న నీటిమట్టం క్రమేపీ స్వల్పంగా తగ్గుతూ రాత్రికి 41 అడుగులకు చేరుకుంది. భద్రాచలం వద్ద వరద స్వల్పంగా తగ్గుతూ నిలకడగా ప్రవహిస్తోంది. దిగువన వరద స్వల్పంగా పెరుగుతోంది.

ముంపు గ్రామాల్లో భయం.. భయం

పోలవరం ముంపు గ్రామాల్లో వరద భయం వెంటాడుతోంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మూడు గ్రామాలకు వరద ముంపు పొంచి ఉంది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలకు చెందిన 70 కుటుంబాలు దాచారంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలించారు. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ముగూడెంకు చెందిన సుమారు 100కు పైగా కుటుంబాలు పునరావాస కాలనీకి తరలివెళ్లాయి. అలాగే రాష్ట్రం విపత్తుల నివారణ దళం సభ్యులు (ఎన్‌డీఆర్‌ఎఫ్) రెండు మండలాలకు చేరుకున్నారు. ఒక్కో మండలంలో 35 మంది బృందంతో అత్యవసర సేవలందించడానికి వీలుగా సిద్ధం చేశారు. జిల్లా అధికార యంత్రాంగం పునరావాస కేంద్రంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు వేలేరుపాడు, కోయిదా, ప్రధాన రహదారిపై ఉన్న ఎద్దులవాగు వంతెన గోదావరి వరద పొంగిపొర్లడంతో వంతెన పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో 18 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు శివారులో వేలేరు వద్ద కిన్నెరసాని వాగుకు వరద నీరు చేరడంతో సమీపంలోని పొలాల్లోకి వరద నీరు పోటెత్తింది. అలాగే కుక్కునూరు మండలంలో గుండేటివాగు లోలెవల్ వంతెన జలదిగ్బంధంలో చిక్కుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి.

కేదారీ ఘాట్‌లోకి వరద నీరు



సిద్ధాంతంలో కేదారీ ఘాట్‌లోకి చేరిన నీరు

పెనుగొండ: సిద్ధాంతం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. కేదారీ ఘాట్‌లోని పుష్కర రేవుల్లోకి వరద నీరు ప్రవేశించింది. మధ్య లంకలోకి పడవల రాకపోకలపై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఆచంట మండలంలోని పెద మల్లంలంక, పల్లెపాలెం, అయోధ్యలంక, పుచ్చల్లంక, నక్కిలంకల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ తహసీల్దార్లకు ఆదేశాలు అందాయి.

కూటమి అరాచక పాలనపై పోరాడుదాం

- సూపర్‌సిక్స్ హామీలపై నిలదీయండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి





వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, పార్లమెంట్ ఇన్‌చార్జి ఉమాబాల, ఎమ్మెల్సీ కవురు, పార్టీ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, సుపరిపాలన.. ఇది మంచి ప్రభుత్వం అంటూ వారి డప్పు వారే కొట్టుకుంటూ పగటి వేషగాళ్లలా నాయకులు డ్రామాలాడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. శనివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ సమావేశాన్ని ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అధ్యక్షతను నిర్వహించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ముదునూరి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై సుమారు 4,500 కేసులు బనాయించారని మండిపడ్డారు. కూటమి దుర్మార్గపు పాలనను ఎండగట్టేలా పోరాటం చేస్తామన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికీ బాబు ష్యూరిటీ–పవన్ గ్యారంటీ అంటూ బాండ్లు అందించారని, ఈ మేరకు ఏడాది పాలనలో చేకూరిన లబ్ధిపై ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఇస్తే గాలికి వదిలేసినట్టేనని ఎద్దేవా చేశారు. ఉచిత బస్సు ప్రయాణానికి గ్యారంటీ లేదని, రైతులకు పెట్టుబడి సాయం, యువతకు నిరుద్యోగ భృతి లేదా 20 లక్షల ఉద్యోగాలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 50 ఏళ్లకే బీసీలకు పెన్షన్ హామీని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి నేతలకు దమ్ముంటే మెడికల్ కళాశాలను అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, కేసులకు అదిరేది, బెదిరేది లేదని ముదునూరి భరోసా ఇచ్చారు.

జగన్‌ను సీఎం చేయడమే లక్ష్యం

నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గుడూరి ఉమాబాల మాట్లాడుతూ పార్టీలో చిన్నపాటి సమస్యలుంటే సర్దుకుపోవాలని, అందరి లక్ష్యం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేయడం కోసమే అనే ఆలోచనా విధానం ఉండాలన్నారు.

ఇది మోసపూరిత ప్రభుత్వం

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అని డప్పు కొట్టుకుంటూ టీడీపీ నాయకులు తిరగడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మంచి ప్రభుత్వమో మోసపూరిత ప్రభుత్వమో ప్రజలు చెప్పాలని అన్నారు. పేదవాడు కనిపిస్తే దోచుకునే విధానం కూటమి నేతలదని అదే పేదవాడు కనిపిస్తే భోజనం పెట్టే గుణం జగన్‌ది అని అన్నారు.

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. బాబు పవన్‌ల పరిస్థితి ఎలా ఉందంటే బాబు బుడగను చూపించి ఇది సంచి అంటే ప్రశ్నించే తత్వం మర్చిపోయిన పవన్ అవును ఇది సంచేనే దుస్థితిలో ఉన్నారన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉమాబాల జ్యోతి ప్రజ్వలనం చేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకట్రాయుడు, సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనందప్రకాష్, కుమారదత్తాత్రేయ వర్మ, యడ్ల తాతాజీ, జెడ్పీటీసీలు నడపన గోవిందరాజులు నాయుడు, గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీలు యిన కొండ ధనలక్ష్మి, సబితి సుమంగళి, కర్రా జయసరిత, జిల్లా యూత్ అధ్యక్షుడు సందీప్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి రమేష్, జిల్లా వీవర్స్ అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు, పట్టణ, మండల అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, ఉచ్చుల స్టాలిన్, పెన్మెత్స ఏసురాజు, కొప్రపాటి వీరాస్వామి, గుమ్మాపు పెద్దిరాజు, కవురు గోపి, గొల్లపల్లి శ్రీనివాస్, మద్దా చంద్రకళ, సునీల్, గుబ్బల సత్యనారాయణ, సాలా నర్సయ్య, విన్‌స్టన్‌బాబు, ఖండవల్లి వాసు, మైలాబత్తుల మైఖేల్‌రాజు, మామిడి బాబు, రావూరి బుజ్జి, బోణం బులివెంకన్న, పెదపాటి పెద్దిరాజు, పాలపర్తి సందీప్, పెచ్చెట్టి కృష్ణాజీ, పెండ్ర వీరన్న, శంకరాపు శ్రీను, కడలి ఏడుకొండలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



భీమవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి

భీమవరం: కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి మండిపడ్డారు. శనివారం భీమవరంలో జరిగిన మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాకినాడ రంగరాయ కళాశాల పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనపై అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. ఎందరో ఉద్యోగినులు బయటకు చెప్పలేక వేధింపుల వేదన అనుభవిస్తున్నారన్నారు. ల్యాబ్ అసిస్టెంట్ కల్యాణ చక్రవర్తి మహిళల ఫొటోలు తీసి బయటకు పంపడంతో పాటు, వీటి ద్వారా మహిళలను బెదిరించడం అత్యంత దారుణమన్నారు. లైంగిక వేధింపుల బాధితులకు న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హోం మంత్రి చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన అధికారులపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన రాష్ట్రంలో జరిగిన కీచక పర్వమని మండిపడ్డారు. మహిళలు మీద చేయి వేస్తే తాటా తీస్తానన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏమయ్యారని ప్రశ్నించారు. 50 మంది మహిళలను నెల రోజుల నుంచి వేధిస్తే ఏం చర్యలు తీసుకున్నారని నిలదీశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే మహిళా లోకం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక భారాలను మోపుతోందని, గ్యాస్‌పై రూ.50 పెంచిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. గిడుతులూరి రత్నం, భోగిరెడ్డి మంజుల, కె.వి జయలక్ష్మి, కోడే భారతి పాల్గొన్నారు.

ఆషాఢం

సంప్రదాయ సమ్మేళనం

- జిల్లాలో ఆధ్యాత్మిక శోభ
- అమ్మవార్లకు సారెలు, విశేష అలంకరణలు
- ఇళ్లలో తెలగ పిండి, మునగాకు వంటకాలు
- ఆడపడుచుల చేతికి గోరింటాకు లేపనాలు
- చక్కర్లు కొడుతున్న కొత్త జంటలు
- దుకాణాల్లో ఆఫర్ల మేళాలు



కొత్త జంటలు, సందర్శకులతో కిటకిటలాడుతున్న పేరుపాలెం బీచ్



తెలగపిండి-మునగాకు కూర

సండే స్పెషల్

సాక్షి, భీమవరం: సంస్కృతి, సంప్రదాయాల పుట్టిల్లు తెలుగు నేల. ప్రకృతితో మమేకం చేస్తూ ఇక్కడి ప్రతి నెలకి ఏదోక విశిష్టత ఉంటుంది. అందులోనూ నాలుగో నెలైన ఆషాఢ మాసం మరింత ప్రత్యేకమైనదిగా భావిస్తారు. వాతావరణాన్ని చల్లబరుస్తూ తొలకరి వర్షాలు, పొంగి ప్రవహించే కాలువలు, వరి నాట్లుతో పచ్చ తివాచీని పరుచుకునే పంట పొలాలు, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, ప్రత్యేక వంటకాలు, ఆచారాలు ఆహ్లాదాన్ని అందిస్తాయి. పౌర్ణమి నాడు చంద్రుడు ఉత్తరాషాఢ, పూర్వాషాఢ నక్షత్రాల్లో సంచరించడం వలన ఈ నెలను ఆషాఢ మాసంగా పిలుస్తారు. మిగిలిన నెలలతో పోలిస్తే శూన్య మాసంగా భావించి శుభకార్యాలు తలపెట్టనప్పటికి దేవతారాధనకు ఇదే సరైన సమయంగా పెద్దలు చెబుతారు. ఆషాఢంలోని తొలి ఏకాదశి రోజునే శ్రీమన్నారాయణుడు యోగ నిద్రలోకి వెళ్లేది. హిందువుల తొల పండుగ కూడా ఇదే.

గురు పౌర్ణమి, స్కంధ షష్టి తదితర పర్వదినాలు జరుపుకుంటారు. జిల్లాలోని గ్రామ దేవతలకు ఆషాఢం సారెలు, మొక్కుబడులు సమర్పించుకోవడం అనాదిగా వస్తోంది. భీమవరం మావూళ్లమ్మ, రాయకుదురు మావూళ్లమ్మ, మహాలక్ష్మి, ఏలూరుపాడులోని ముసలమ్మ, ఎల్లమ్మ, మోగల్లులోని పెన్నేరమ్మ, మారమ్మ, గంగాదేవి అమ్మవార్లు, జిల్లాలో పేరొందిన గ్రామ దేవతల ఆలయాల్లో ఆషాఢ మాసం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శాఖాంబరిగా, ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తున్నారు.


నవ దంపతుల చక్కర్లు

కొత్తగా పెళ్లైన జంట ఆషాఢంలో అత్తవారింటి గడప దాటకూడదని సంప్రదాయం. ఈనెల్లో దంపతులు కలిస్తే తొమ్మిది నెలల తర్వాత మండు వేసవిలో కాన్పు వచ్చే అవకాశం ఉంది. వైద్య సదుపాయాలు అంతగా లేని ఆ రోజుల్లో ఇది తల్లీబిడ్డకు మంచిది కాదు. తొలకరి జల్లులతో సార్వా పనులు మొదలయ్యేది ఇప్పుడే. కొత్త పెళ్లికొడుకు పొలం పనులకు పోకుండా భార్య కొంగు పట్టుకుని తిరిగితే తిండి గింజలకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నది ఒక కారణం. అనుభవ జ్ఞానంతోనే పూర్వీకులు ఆషాఢం వేళ కొత్తజంట అత్తింటి గడప దాటకూడదనే ఆచారం తెచ్చారంటారు. అయినా ఇంటిలోని వారికి ఏవో సాకులు చెప్పి నవ దంపతులు చక్కర్లు కొట్టడం, ఏమీ తెలీనట్టుగా అత్తమామలు లోలోపల మురిసిపోవడం ప్రతి ఇంటా జరిగే తంతే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో పార్కులు, పేరుపాలెం బీచ్, ఇతర పర్యాటక కేంద్రాలు కొత్త జంటలతో కళకళలాడుతున్నాయి.

వంటకాలూ ప్రత్యేకమే

వర్షాలతో శరీరం చల్లబడి నజ్జు చేయడం, ప్రతికూల వాతావరణంతో ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. వీటికి నివారణగా తెలగపిండి–మునగాకు, పప్పు–వాగ కాయలు ఈ ఆషాఢ మాసంలో వండుకోవడం జిల్లా అంతటా కనిపిస్తుంది. గ్రామల్లో నివసించే వారు పట్ట ణాల్లోని తమ వాళ్లకు ప్రత్యేకంగా వండి పంపిస్తుంటారు. వీటిలోని పోషకాలు శరీర ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఆషాఢంలో ఒక్కసారైన ఈ కూరలు తినాలనేది అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సీజన్‌లో వచ్చే నేరేడుపండ్లు, తాటికాయాలు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి.

అరుదైన కాలం ఆషాఢం



ఆషాఢ మాసం అన్ని నెలల్లోనూ అరుదైనది. సూర్యుడు మిధున రాశి నుంచి కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తాడు. ఈ సమయంలో వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయి. వీటిని తట్టుకునేలా మనుషులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వచ్చే మార్పుల ప్రభావం వ్యాధి నివారణకు ఉపకరిస్తుంది. పండితులు చాతుర్మాస దీక్షలు చేపడతారు. ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్యం పెనవేసుకున్నా మాసం ఆషాఢం.

– రామశాస్త్రి, పండితులు, ఆకివీడు

అన్నింటా ఆఫర్ల మేళా

ఆషాఢం వేళ అన్నింటా ఆఫర్ల మేళానే. జిల్లాలో ఏలూరు, భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, జంగారెడ్డిగూడెం, నరసాపురం, నూజివీడు తదితర పట్టణాల్లోని క్లాత్, రెడీమేడ్, జ్యూయలరీ, కాస్మోటిక్స్ షోరూంలతో పాటు మండల కేంద్రాల్లోని చిన్న దుకాణాల్లో సైతం ప్రస్తుతం ఆషాఢం ఆఫర్లు నడుస్తున్నాయి. మహిళల్ని ఆకర్షించి అమ్మకాలు ఆషాఢం సేల్ అంటూ వ్యాపారులు ఆఫర్లు ప్రకటిస్తున్నారు.



కాళ్ల మండలం ఏలూరుపాడులో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

గోరింట పూస్తుంది

ఆరేళ్ల పాపాయి నుంచి 60 ఏళ్ల వృద్ధురాలి వరకు అరచేతులు, కాళ్లకు పారాణిగా గోరింటాకు పెట్టుకునేందుకు ఉత్సాహపడతారు. పల్లెల్లోని అమ్మమ్మలు, నానమ్మలు గోరింటాకును రుబ్బించి పట్టణాల్లోని తమ కుమార్తెలు, కోడళ్లు, మనవరాళ్లకు పంపిస్తుంటారు. ఈ సీజన్‌లో గోరింటాకు పెట్టుకోవడం వెనుక శాస్త్రీయ కారణంగా ఉంది. వర్షాల వలన ఇంట్లో పనులు చేసుకునే మహిళల కాళ్లు, చేతులు పగుళ్లు తీస్తుంటాయి. గోరింటాకు పగుళ్లు రాకుండా చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇలా ఆషాఢ ఆచారాలు ఆధ్యాత్మికతతో పాటు ఆరోగ్య కారకాలుగా ఉన్నాయి.

క్లుప్తంగా

ఆషాఢంలోనూ తగ్గని భక్తుల రద్దీ



భక్తులతో నిండిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్

ద్వారకాతిరుమల: ఆషాఢ మాసం అయినప్పటికీ శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ తగ్గలేదు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దాంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, షాపింగ్ కాంప్లెక్స్, కల్యాణకట్ట తదితర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రాము

కై కలూరు: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలిదిండి మండలం మూలలంకలో శనివారం జరిగింది. కలిదిండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మామిడిశెట్టి రాము(45) భార్య రెండేళ్ళ క్రితం బతుకుదెరువు నిమిత్తం కువైట్ వెళ్ళింది. వీరికి పాప, బాబు సంతానం. పాప వసతిగృహంలో చదువుతోంది. బాబు తండ్రి వద్దే ఉంటున్నాడు. రాము చేపల చెరువులపై పనులు చేస్తాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. తల్లి కృష్ణవేణి ఫిర్యాదుపై ఎస్సై వి.వేంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకలను కబళిస్తున్న వింత వ్యాధి

ఆగిరిపల్లి: మండలంలోని వడ్లమాను గ్రామంలో గత మూడు రోజుల నుంచి వింత వ్యాధితో మరణించడంతో గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామానికి చెందిన సాదం స్వామికి 50 మేకలుండగా.. గురువారం ఒక మేక నురగ కక్కుతూ మృతి చెందింది. ఆ వ్యక్తి మందులు వేసినా శుక్రవారం మరో నాలుగు మేకలు మరణించాయి. శనివారం నాలుగు మేకలు పొట్ట ఉబ్బి నురగ కక్కుతూ చనిపోయాయి. ఎంపీటీసీ రాణి మేకల సత్యనారాయణ ఆగిరిపల్లి పశువైద్యాధికారి హనుమంతరావుకు సమాచారం అందించారు. ఆయన తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మేకలను పరీక్షించి వైద్యం అందజేశారు. ఇదే విషయమై పశు వైద్యాధికారి హనుమంతరావుని సంప్రదించగా ×కాప్రియస్ క్లోరో న్యుమోనియ్హెఅనే బ్యాక్టీరియా వల్ల మేకలు మరణించవచ్చని తెలిపారు. శాంపిల్స్ ఏలూరు ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. వైద్యం అందించిన ఇంకా పది మేకల పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు స్వామి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాడు.

మైనింగ్ దెబ్బకు రోడ్లు ఛిద్రం

- కైకలూరు నియోజకవర్గంలో నిబంధనలు పాటించని మైనింగ్ నిర్వాహకులు
- ఎమ్మెల్యే కామినేని స్వగ్రామం వరహాపట్నం రోడ్డుకూ గుంతలు
- సీనరేజ్ చెల్లించకుండా రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి



కలిదిండి మండలం నుంచి టిప్పర్‌లో లోడు చేస్తున్న మట్టి (ఫైల్)



వరహాపట్నం రింగ్ రోడ్డు వద్ద రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మైనింగ్ మాఫియాకు కైకలూరు నియోజకవర్గం కేజీఎఫ్ గనిగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే మట్టి, ఇసకను ఆదాయ వనరుగా మార్చేసుకున్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలు కన్నెత్తి చూసే సాహసం చేయడం లేదు. ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత రావడంతో పగటిపూట కాకుండా సాయంత్రం నుంచి తెల్లవార్లు టిప్పర్లతో ఇతర జిల్లాలకు తరలించేస్తున్నారు. నేషనల్ హైవే పనులు పేరు చెప్పి సీనరేజ్ చెల్లించకుండా రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్.. ×నా బంధువులైనా టిప్పర్లతో మైనింగ్ చేస్తూ బయట విక్రయిస్తే కేసులు పెట్టండి₹ అని మీడియా ముందు పోలీసులకు చెప్పడం ఉత్తుత్తి మాటలని తేలిపోయాయి.

హైవే పనులు చెప్పి అక్రమార్జన


నియోజకవర్గంలో పెదపాలపర్రు నుంచి ఉప్పుటేరు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు రూ.275 కోట్లతో చేస్తున్నారు. ఈ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అధికారంలోకి రాగానే హైవే పనులకు మట్టిని తరలించే వాళ్ళను కాదని, కూటమి నేతలు కొందరు టిప్పర్లతో ఇసుకను రవాణా చేస్తున్నారు. టిప్పర్లపై తీవ్ర విమర్శలు రావడంతో మార్చి 22న ఎమ్మెల్యే కామినేని నెల రోజుల్లో 5,000 టిప్పర్ల తరలింపునకు హైవేకు అవకాశం కల్పించాలన్నారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి హైవేకు కాకుండా బయటకు వెళ్తే సీజ్ చేయాలని ఆర్డీవో, సీఐలకు ఆదేశించారు. తిరిగి ఏప్రిల్ 27న హైవే పనులకు 10,000 టిప్పర్లు అవసరం ఉందని, కై కలూరు, మండవల్లి మండలాల్లో మాత్రమే అనుమతించాలని చెప్పారు. చివరకు పోలీసులు ఏర్పాటు చేసిన సరిహద్దుల్లో చెక్ పోస్టులు సైతం తీసేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యే అమెరికా వెళ్ళారు. ఇదే అదనుగా రాత్రి వేళ టిప్పర్లను ఇతర జిల్లాలకు కూటమి నేతలు తరలిస్తున్నారు.

టిప్పర్లతో రోడ్లు ధ్వంసం

టిప్పర్ల దెబ్బకు నియోజకవర్గంలో పలు రహదారులు ధ్వంసమయ్యాయి. వాస్తవానికి ఆర్అండ్‌బీ రహదారులు 25 నుంచి 30 టన్నులను భరించగలవు. టిప్పర్లు ఏకంగా 40 టన్నుల పైగా అధికలోడుతో వెళ్తున్నాయి. దూరాన్ని బట్టి ఒక్కో టిప్పరును రూ.10,000 నుంచి రూ.11,000 విక్రయిస్తున్నారు. ఇటీవల కై కలూరు - కలిదిండి రోడ్డును నిర్మించారు. ఈ రహదారి టిప్పర్ల కారణంగా దెబ్బతింది. ప్రధానంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ స్వగ్రామమైన వరహాపట్నం రింగ్ వద్ద మరింత దారుణంగా మారింది. రాచపట్నం, గోపవరం, వేమవరప్పాడు, వెంకటాపురం, గోపాలపురం పెదగొన్నూరు, వణుదుర్రు, దేవపూడి, బొమ్మినంపాడు, శీతనపల్లి, చిగురుకోట, భైరవపట్నం, గన్నవరం వంటి ప్రాంతాల్లో మైనింగ్ కారణంగా రోడ్లు పాడవుతున్నాయి. అధిక లోడు వాహనాల కారణంగా పాడైన రోడ్డుకు రూ.20 లక్షల వరకు పరిహారం చెల్లించాలనే నిబంధన అమలు కావడం లేదు. నేషనల్ హైవే డీఈఈ సత్యనారాయణను వివరణగా కోరగా ప్రస్తుతానికి హైవే పనులకు టిప్పర్లు తిరగడం లేదన్నారు.



గోపవరంలో టిప్పర్ల ధాటికి పాడైన రహదారి



కైకలూరు పంచాయతీ వద్ద దెబ్బతిన్న రోడ్డు

నిబంధనలు గాలికి.. ఆదాయం జేబులోకి

మైనింగ్ చేయాలంటే సవాలక్ష నిబంధనలు విధించారు. మైనింగ్ మాఫియాకు మాత్రం ఇవేవీ పట్టదు. ప్రభుత్వానికి వచ్చే రూ.కోట్ల అదాయాన్ని మట్టి మాఫియా తమ జేబుల్లో నింపుకుంటుంది. మైనింగ్ విషయంలో టిప్పర్లకు, ట్రాక్టర్లకు ఒకే నిబంధన ఉంటుంది. ఇక్కడ ట్రాక్టర్లకు ఏకంగా అధికారులే మినహాయింపు ఇస్తున్నారు. ఇప్పటికే ఆక్వా చెరువుల కారణంగా అధిక ఉత్పత్తులతో వెళ్తున్న చేపల లోడులతో ఈ ప్రాంతంలో రహదారులు పాడయ్యాయి. ఇప్పుడు మట్టి టిప్పర్లతో మరింతగా ధ్వంసమవుతున్నాయి. ఇప్పటికైన జిల్లా అధికారులు మట్టి అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఏ క్షణాన కూలుతుందో..



ఆకివీడు ఏఎంసీ సమీపంలో కూలడానికి సిద్ధంగా ఉన్న సచివాలయం-5 కార్యాలయ భవనం

ఆకివీడు: స్థానిక వ్యవసాయ మార్కెట్(ఏఎంసీ) సమీపంలో ఉన్న భవనం కూలడానికి సిద్ధంగా ఉన్నా ఆ భవనంలోనే విద్యా సంస్థను నడుపుతున్నారు. అందులో వార్డు సచివాలయ కార్యాలయం ఉంది. అన్ని అంతస్తుల్లోనూ పెచ్చులూడిపోయాయి. పిల్లర్లలో వేసిన కాంక్రీట్ పూర్తిగా దెబ్బతింది. బీములో కూడా ఇదే పరిస్థితి. భవనం అండర్ గ్రౌండ్ భాగంలో వర్షపు నీరు నిలిచిపోతోంది. వర్షాకాలం వస్తే చెరువును తలపిస్తుందని విద్యార్థులు, సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తమ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని సచివాలయ సిబ్బంది ప్రజా పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు భవనంలోని ప్రైవేటు విద్యా సంస్థలో చదువుతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని భయాందోళనలో ఉన్నారు. భవనంలో విద్యాభ్యాసం కొనసాగించడం ప్రాణాలమీదకు తెచ్చుకోవడమేనని అంటున్నారు.



భవనం బీముల్లోని కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయిన దృశ్యం

నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

- ఏలూరు జిల్లాలో 6, పశ్చిమ గోదావరిలో 14 ఇంజనీరింగ్ కాలేజీలు
- ఆచితూచి ఆప్షన్లు పెట్టుకోవాలంటున్న నిపుణులు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేటి నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ మొదలు కానుంది. ర్యాంకులు సాధించడం ఒక ఎత్తయితే అనుకున్న కళాశాలల్లో సీట్లు సాధించడం మరొక ఆప్షన్ల ఎంపికలో తొందరపడితే భవిష్యత్‌పై ప్రభావం పడుతుందంటున్నారు. అందువల్ల ఆచితూచి ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

షెడ్యూల్ ప్రకారం ఈ నెల 13 నుంచి 18 వరకూ వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంటుంది. మంచి ర్యాంకులు సాధించిన వారు సీఎస్ఈకే మొగ్గుచూపుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇటీవల కొత్తగా ఒక ట్రెండ్ నడుస్తోంది. ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఆయా ప్రాంతాల్లోని ఇంటర్నెట్ సెంటర్ల నిర్వాహకులకు మంచి ఆఫర్లు ఇస్తున్నారు. తమ కళాశాలకు తొలి ప్రాధాన్యతగా వెబ్ ఆప్షన్లు ఇచ్చేలా ఇంటర్నెట్ సెంటర్‌కు వచ్చే విద్యార్థులతో ఒప్పించి ఆప్షన్ పెట్టిస్తే ఒక్కో విద్యార్థికి రూ.5 వేల కమిషన్ ఇచ్చేలా ఒప్పందం చేసుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో పాటు వివిధ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకులకు కూడా ఆయా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఇలాంటి ఆఫర్లనే ఇస్తున్నారని తెలిసింది. ఆయా లెక్చరర్ల ద్వారా తమ కళాశాలలో విద్యార్థులను చేర్పితే లెక్చరర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఇస్తున్నారంటున్నారు.

దళారులను నమ్మొద్దు

అయితే ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు, మరికొందరి మాటలు నమ్మితే విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందంటున్నారు. బాగా నమ్మకస్తులైన వారి సూచనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. కొంతమంది కేవలం తాము చెప్పిన కళాశాలకే ఆప్షన్ పెట్టి మరే ఆప్షన్ అవసరంలేదని నమ్మిస్తున్నారని తెలుస్తోంది. అలా చేస్తే సాంకేతిక కారణాల వల్ల సీటు రాకపోతే రెండో కౌన్సెలింగ్ వరకూ వేచి ఉండాల్సి వస్తుంది. ఆ సమయంలో తమకు ఆశించిన కళాశాలలో సీటు కోల్పోయే ప్రమాదముంటుందని చెబుతున్నారు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చే సమయంలో పాస్‌వర్డ్‌ను ఎవరికీ చెప్పవద్దని సూచిస్తున్నారు. ఇటీవల వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు నేరుగా తమకు సమీపంలోని కళాశాలలకే వెళుతున్నారని, అక్కడ వెబ్ ఆప్షన్ ఇచ్చే క్రమంలో పాస్‌వర్డ్ వారికి చెప్పాల్సి వస్తోందని, ఆ సందర్భం వస్తే విద్యార్థులే వారి పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేస్తామని సంబంధిత వ్యక్తులకు ఖరాఖండిగా చెప్పాలని సూచిస్తున్నారు. వారికి వచ్చే ఓటీపీని కూడా ఇతరులతో పంచుకోవద్దని చెబుతున్నారు. ఇలా చేస్తే విద్యార్థుల ఎదుట వారు చెప్పిన క్రమంలోనే ఆప్షన్లు ఇచ్చినా వారు వెళ్ళిన తరువాత వారే ఆప్షన్లు మార్చే అవకాశముందంటున్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్లు ఇవే..

విద్యార్థులకు సహకరించేందుకు సాంకేతిక విద్యాశాఖ అధికారికంగా కొన్ని హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఏలూరు జిల్లాలో అధికారిక హెల్ప్‌లైన్ సెంటర్ ఒక్కటీ కూడా ఇవ్వలేదు. ఏలూరు జిల్లా విద్యార్థులు అధికారిక హెల్ప్‌లైన్ సెంటర్ సేవలు పొందాలంటే తణుకులోని ఎస్ఎంవీఎం పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్ళాలి. విజయవాడలోని ఆంధ్రా లయోలా కాలేజ్, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాల, స్టెల్లా కాలేజ్ ఎదురుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ సెంటర్లకు వెళ్ళవచ్చు. కాకినాడలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల, జేఎన్‌టీయూ కాకినాడల్లో ఏర్పాటు చేసిన అధికారిక హెల్ప్‌లైన్ సెంటర్లకు వెళ్ళవచ్చు.

ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు ఇలా..

ఇంజనీరింగ్ విద్య అభ్యసించాలనుకునే విద్యార్థుల కోసం ఏలూరు జిల్లాలో మొత్తం 6 ఇంజనీరింగ్ కళాశాలలు అందుబాటులో ఉన్నాయి. సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల, హేలాపురి ఇంజనీరింగ్ కళాశాల ఏలూరు శివారు ప్రాంతాల్లో ఉన్నాయి. ఆగిరిపల్లిలో ఎస్ఆర్‌ఐ ఇంజనీరింగ్ కళాశాల, నూజివీడులో సారధి ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి ఈ ఏడాది విద్యార్థులకు ఆయా బ్రాంచుల్లో మొత్తం 4920 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 14 ఇంజనీరింగ్ కళాశాలలుండగా దాదాపు 14,600 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి.

'కళ్ల కలక'లం

- సులువుగా వ్యాపిస్తుందంటున్న వైద్యులు
- వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



దెందులూరు: శరీరంలో ఏ భాగానికి అనారోగ్యం వచ్చిన తట్టుకోవచ్చు కానీ కళ్లకు చిన్న ఇబ్బంది వచ్చినా తట్టుకోలేం. వర్షాకాలం కావడంతో జిల్లాలో కళ్ల కలకతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వైరస్ వల్ల సోకే ఈ అంటువ్యాధి ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది.

వ్యాధి లక్షణాలు

కళ్ళు ఎరుపుగా మారి వెలుతురు చూడలేకపోవడం. కంటి నుంచి నీరు కారటం, దురద, మంట, పుసులు కట్టడం, కన్ను నొప్పి.

వ్యాధి వ్యాప్తి

కళ్ల కలక ఉన్న వ్యక్తి వాడిన వస్తువులు వ్యాధి లేని మరో వ్యక్తి తాకి కళ్లను ముట్టుకోవడం వల్ల ఇది వ్యాపిస్తుంది.

నివారణ చర్యలు

గోరువెచ్చని నీటితో కళ్లను తరచూ శుభ్రం చేసుకోవాలి. శుభ్రమైన తువాలుతో కళ్లను తుడవాలి. కళ్లద్దాలు ధరించాలి. వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. కళ్లలో మందులు వేయడానికి ముందు తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడగాలి.

చేయకూడనివి

కళ్ల కలక ఉన్న వ్యక్తి వాడిన టవల్స్, దిండ్లు, దుప్పట్లు వేరొకరు వాడకూడదు. కళ్ళు ఎర్రగా ఉంటే పాఠశాలకు పంపించకూడదు. కళ్ళలో ఆకుపసరు వంటివి వేయకూడదు. మూడు నుంచి నాలుగు రోజుల్లో పరిస్థితి మెరుగు పడకపోతే కంటి వైద్యుడిని సంప్రదించాలి. కళ్ల కలక విస్తరింపకుండా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



కళ్ల కలక లక్షణాలు, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దెందులూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో ప్రజలకు అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నా. కళ్ల కలక విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ సుందర్ బాబు, సూపరింటెండెంట్ దెందులూరు సీహెచ్‌సీ

ఆదుకోవాలంటూ రోడ్డు ప్రమాద బాధితుల ధర్నా



రోడ్డుపై బైఠాయించిన మృతుడి కుటుంబ సభ్యులు

ఆగిరిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులతో పాటు గ్రామస్తులు ధర్నా నిర్వహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. మండలంలోని నెక్కలం గొల్లగూడెంకి చెందిన పటాపంచల గంగరాజు (35) శుక్రవారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై ఆగిరిపల్లి వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టింది. గంగరాజును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడు. గంగరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలంటూ టీడీపీ నాయకులు, గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ కు వచ్చారు. అక్కడ చర్చలు ఫలించకపోవడంతో శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి నెక్కలం గొల్లగూడెంలో ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలని ధర్నా నిర్వహిస్తున్నా మంత్రి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా నిర్వహిస్తున్న ప్రభుత్వం గానీ, పార్టీ నాయకులు గాని పట్టించుకోలేదని స్థానిక టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు వైపులా నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నూజివీడు డీఎస్పీ గ్రామానికి చెందిన పెద్దలతో చర్చలు జరిపి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

వ్యక్తి ఆత్మహత్య

పెదవేగి: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి ఎస్సై వివరాల ప్రకారం.. పెదవేగి మండలం న్యాయంపల్లికి చెందిన డి.రమేష్ (40) కూలి పనులు చేస్తూ భార్యా ఇద్దరు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య విభేదాలు ఉన్నాయి. భార్య కలపర్రు లో తన పుట్టింటిలో ఉండగా ఇతను న్యాయంపల్లిలో శుక్రవారం పురుగుల మందు తాగాడు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తప్పిన ముప్పు

- 54 మంది ప్రయాణికులు సురక్షితం
- ముగ్గురికి స్వల్ప గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

దెందులూరు: జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సీతంపేట పాల డెయిరీ వద్ద అత్యంత వేగంతో లారీని వెనుక నుంచి వైజాగ్ నుంచి చెన్నై వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీ కొట్టింది. ఆ సమయంలో బస్సులో 57 మంది ప్రయాణికులు ఉన్నారు. ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న వెంటనే దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ, హైవే సేఫ్టీ పోలీస్ సిబ్బంది బాధితులను హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వేరే బస్సులో ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మహిళా వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని తప్పక సంరక్షించాలని మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. స్థానిక వాకర్స్ వాకింగ్ ట్రాక్ వద్ద శనివారం పర్యావరణ పరిరక్షణకు మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ కాలుష్యం వల్ల పర్యావరణంనకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. రోడ్డు ప్రక్కన ఉన్న నీడనిచ్చే చెట్లును నరకరాదని కోరారు. ఈ కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, మేరీ వ్రజమ్మ, ఉదయ్‌కుమారి, వెంకటలక్ష్మి, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు సారె సమర్పణ



వాసవీ మాతకు సారె అందజేసిన మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ఏలూరు రోడ్డులో శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని వాసవీ అమ్మవారికి శనివారం 250 కేజీల ఆషాఢం సారె అందజేశారు. వివిధ రకాల పండ్లు, స్వీట్లు, పూలతో పాటు చీరలు, పసుపు, కుంకుమ, గాజులు అమ్మవారికి సారెగా సమర్పించారు. ఈ సందర్భంగా విశేష పూజలు జరిగాయి. 500 మంది మహిళలు పాల్గొన్నారు. ఆర్యవైశ్యులు మారం వెంకటేశ్వరరావు, కొర్లేపర రాము, నున్నా సుందరరావు, బోగవిల్లి రమేష్, ఆలపాటి చిన్న, సత్యనారాయణ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వనితా క్లబ్, వాసవీ క్లబ్, ప్రపంచ ఆర్య వైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో సినీ సంగీత సుమధుర వాహిని



బీవీఆర్‌లో సినీ సంగీత దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో శనివారం రాత్రి బాలు స్మృతిలో సినీ సంగీత సుమధుర వాహిని కార్యక్రమం శనివారం జరిగింది. బాలు కళా మిత్ర మండలి సభ్యులు సతీష్ పర్యవేక్షణలో గాయకులు సోని, జ్యోత్స్న, పూర్ణిమ, కామేష్, శరత్, జగదీష్, సుధాకర్‌లచే ఆలపించిన బాలు, జేసుదాసు పాటలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు, నరసింహాచార్యులు, పైలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాథ్స్ గెస్ట్ (అతిథి) ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ ఇన్ మ్యాథ్స్ సబ్జెక్టు పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపాల్ పి.నాగమణి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఖాళీగా ఉన్న పోస్టులో గెస్ట్ లెక్చరర్‌గా నియమాకం చేపడుతున్నట్లు తెలిపారు. సబ్జెక్ట్‌కు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సంప్రదించాలని కోరారు.

వరాల వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అత్తిలి: మండలంలోని ఈదూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, ఉదయం అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను జరిపారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

పెంటపాడు: మండలంలోని మీనవిల్లూరు గ్రామంలో పేకాడుతున్న పలువురిని అరెస్టు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. పంట పొలాల్లో పేకాడుతున్న ఆరుగురిని గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ. 9.500ల నగదును స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

అధిక ఎండలతో ‘తెట్టు’ కడుతోంది!

- నీరు పోయేలా చూడాలి
- సమృద్ధిగా ఎరువులు
- అవసరాల మేరకు వినియోగించాలి
- ‘గూడెం’ ఏవో నారాయణరావు



తాడేపల్లిగూడెం మండలంలో వరి నాట్లలో తిష్ట వేసిన తెట్టు

తాడేపల్లిగూడెం రూరల్: పది రోజులుగా కాస్తున్న ఎండలకు మండలంలోని వరి చేలపై పచ్చని తెట్టుకడుతోంది. దీంతో రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తుంది. మండలంలో మొత్తం 25 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఇప్పటి వరకు మెట్ట ప్రాంతంలో నాట్లు వేశారు. ఒకటో కోటా ఎరువులను ఇప్పటికే వేశారు. అయితే, వర్షాలు పడకపోవడం, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, నీరు నిల్వ ఉండటం వంటి కారణాలతో చేలపై తెట్టు కడుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఎరువుల వేసిన 48 గంటల తర్వాత చేలలోని నీరు బయటకు పోయేలా మార్గాలను ఏర్పాటు చేయడం, కొత్త నీరు పెట్టడం ద్వారా ఈ తెట్టును నివారించవచ్చని సూచిస్తున్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడొద్దని హితవు పలికారు. అధిక ఎరువుల వినియోగం వద్ద చీడపీడలు దాడి చేసే అవకాశం ఉందన్నారు.

అందుబాటులో అన్ని రకాల ఎరువులు



మెట్ట మండలమైన తాడేపల్లి గూడెంలో ఇప్పటికే సార్వా నాట్లు పూర్తయ్యాయి. నాలుగు సొసైటీల పరిధిలోని 14 డిపోలలో 355టన్నుల యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు అవసరాల మేరకే ఎరువులు కొనుగోలుచేయాలి. ఎరువుల సరఫరాకు ఇబ్బంది లేదు.

– నారాయణరావు,
మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

ధనికులకేనా తల్లికి వందనం?

పెంటపాడు: పేద విద్యార్థుల కోసం అమలు చేస్తున్న తల్లికి వందనం కేవలం ధనికులకే దక్కుతున్నాయని పెంటపాడుకు చెందిన సామాజిక కార్యకర్త, ధన్యమహిళామండలి నాయకురాలు పడాల భవాని ఆరోపించారు. శనివారం సాయంత్రం ఆమె పెంటపాడులోని ఒక రైస్‌మిల్లు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. మండలంలో పలు చోట్ల ధనికులకే తల్లికి వందనం సొమ్ములు దక్కుతున్నాయన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఈ విషయంపై అధికారులు పునరాలోచించుకోవాలన్నారు. అవినీతికి అలవాటు పడిన అధికారుల వల్ల అర్హులైన నిజమైన పేదలకు దక్కాల్సిన ఫలాలు అందడం లేదన్నారు. గతంలో ఇదే మహిళ ప్రభుత్వ అధికారులను మోసం చేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. పలు ప్రాంతాలలో ఇదే విధంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు పూర్తి సర్వే చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

వ్యసనాల జోలికి వెళ్లొద్దు



తణుకులో మత్తుపదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్సై లక్ష్మి



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

తణుకు అర్బన్: మత్తు పదార్థాలవలన కలిగే దుష్ప్రభావాలపై శనివారం కేర్ కమిటీ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో తణుకు బస్‌స్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై బి.లక్ష్మి మాట్లాడుతూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వలన స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్యాల బారినపడి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన బాధితుల శరీరంలో వివిధ అవయవాలు గొంతు, అన్నవాహిక, కాలేయం, పెద్ద ప్రేగులు, గుండె తదితర అవయవాలపై చూపే దుష్ప్రభావాలు ఉంటాయన్నారు. మానసిక ఆందోళన, డిప్రెషన్, అధిక రక్తపోటు తదితర లక్షణాలు కలుగుతాయని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిస అయినవారికి ఆ వ్యసనం నుంచి బయటపడడంతో పాటు పునరావాసం కల్పించుటకు అవసరమైన కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది, కేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తుతో అనర్థం

తాడేపల్లిగూడెం: మద్యం మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల అనేక అనర్థాలున్నాయని ఎక్సైజ్ సిబ్బంది సీడబ్ల్యూసీ గోదాము కార్మికులకు శనివారం అవగాహన కల్పించారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సిబ్బంది మాట్లాడుతూ నాటుసారా, మద్యపానం వల్ల కలిగిన అనారోగ్యాల నుంచి ,వ్యసన విముక్త కేంద్రాల గురించి వివరించారు. సీఐ స్వరాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐలు జి.మురళీమోహన్, ఆర్.దొరబాబు, హెచ్‌సీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరిస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలుకు సీపీఐ శ్రేణులు నిర్విరామంగా ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. స్థానిక కపర్ది భవనంలో శనివారం సీపీఐ పట్టణ 18వ మహాసభ జరిగింది. భీమారావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలిస్తామని, విదేశాలలో ఉన్న నల్లధనం వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి బ్యాంక్ ఖాతాలో 15 లక్షలు జమ చేస్తామని, వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామంటూ అనేక వాగ్దానాలు గుప్పించి అధికారంలోకి వచ్చి పదకొండ సంవత్సరాలు గడుస్తున్న ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విమర్శలు చేశారు. దేశ సంపదగా ఉన్న లక్షల కోట్లు రూపాయిలు విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీలు వంటి బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేశారని, దేశానికి తీరని ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. మతతత్వాన్ని రెచ్చగొడుతూ ప్రజల మధ్య మత విద్వేషాలు పెంచుతూ దేశంలో అశాంతికి ఆజ్యం పోస్తున్నారని, లైకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ హామీల అమలులో చిత్తశుద్ధి కొరవడింది

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలలో చిత్తశుద్ధి కొరవడిందని, పేదల స్వంత ఇంటి కల నెరవేరుస్తారని, ఇరవై లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి అంటూ అనేక వాగ్దానాలు చేసి వాటి అమలులో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ప్రభుత్వాల మోసపూరిత వాగ్దానాలపై ప్రజల్లోకి వెళ్ళి వారిని చైతన్యం చేసి ప్రజా పోరాటాలకు సన్నద్ధం చేయాలని భీమారావు కోరారు. పట్టణ సమితి సభ్యురాలు ఎస్.నాగలక్ష్మి సభకు అధ్యక్షత వహించారు. తొలుత సీపీఐ పతాకాన్ని సీనియర్ నాయకులు అల్లం రాము ఆవిష్కరించారు. నూతన పట్టణ సమితిని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. పట్టణ కార్యదర్శిగా మండల నాగేశ్వరరావు, సభ్యులు ఎస్.నాగలక్ష్మి, వడ్డాది మేరి, దాస్యం రాము, తూము సత్యనారాయణలు ఎన్నికయ్యారు. రాష్ట్ర, జిల్లా, పట్టణ సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

పంటబోదెలోకి మురుగునీటి డ్రెయిన్ కలపవద్దు



అత్తిలి నిరసన తెలుపుతున్న రైతులు

అత్తిలి: అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్ నుంచి పాలూరు డ్యాం వరకు స్టేట్‌హైవే వెంబడి నిర్మిస్తున్న డ్రెయిన్ నిర్మాణం అవుట్‌లెట్‌ను పంటబోదెలోకి కలిసే విధంగా ఏర్పాటు చేయడం పట్ల శనివారం స్థానిక రైతులు నిరసన వ్యక్తం చేశారు. అత్తిలి గ్రామంలో స్టేట్‌హైవేను ఆనుకుని ఉన్న మట్టపర్తిగర్వు ప్రాంతంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.15 లక్షలతో డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే డ్రెయిన్ అవుట్‌లెట్‌ను పంటబోదెలో కలపడానికి అధికారులు డిజైన్ చేశారు. పంటచేలకు నీరందించే పంటబోదెలోకి మురుగుడ్రెయిన్ అవుట్‌లెట్ కలపడం సరికాదని రైతులు మండిపడుతున్నారు. అత్తిలి ప్రధాన కాలువ నుంచి వెళ్లే కృష్ణమోహన్ గారిపంటబోదె ద్వారా మట్టపర్తిగర్వు ప్రాంతంలో సుమారు 40 ఎకరాల ఆయుకట్టు సాగు అవుతోందని, మురుగు డ్రెయిన్ నీరు పంటబోదెలో కలపడం వల్ల పంటలు దెబ్బతిని నష్టపోతామని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మురుగునీటి డ్రెయిన్ అవుట్‌లెట్‌ను పంటబోదెలోకి కాకుండా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ సెక్రటరీ జి భాస్కర్‌ను వివరణ కోరగా స్టేట్‌హైవే వెంబడి నిర్మించే డ్రెయిన్ కేవలం రోడ్డుపై కురిసిన వర్షంనీరు మాత్రమే వెళ్లే విధంగా ఏర్పాటు చేశామని, ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు డ్రెయిన్‌లోకి రాదని తెలిపారు.



రైతుల సాగునీటి అవసరాలను తీర్చే పంటబోదె

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టి.అప్పలస్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ పట్టణ కమిటీ సమావేశం ఎం.రాజేష్ అధ్యక్షతన శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగింది. అప్పలస్వామి మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ 6,400 కోట్లు ఉందని అవి తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో పేద విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆనాడు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కావస్తున్న నేటికి హామీలు అమలు చేయలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆర్.సాయి. టి.విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నిరసన

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని విద్యాశాఖ మత్తులో ఉందని, మేలుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు ఎద్దేవా చేశారు. పట్టణంలోని టూ టౌన్‌లోని ఒక ఓ ప్రైవేట్ విద్యాసంస్థ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రెండోవ శనివారం పాఠశాలను యాథావిధిగా నిర్వహించడాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు తప్పుపట్టారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ అడ్డుకుంది. స్కూల్‌లో బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకురాలు బి.సింధు, పట్టణ కమిటీ అధ్యక్షుడు రవి, నాయకులు కేశవ, గణేష్, భాను, సుజాత, ధనుష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ డిపోలో రోజు వారి వేతనంతో అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా (ఉద్యోగం) పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ డిపో మేనేజర్ ఏడీఎల్ సుధారాణి విజ్ఞప్తి చేశారు. డ్రైవర్ బయోడేటా పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు. హెవీ లైసెన్స్‌తో రెండు సంవత్సరాలు సీనియారిటీ కలిగి ఉండాలని, ఎటువంటి యాక్సిడెంట్స్ లేనట్లుగా బ్రేక్ ఇనస్పెక్టర్ నుంచి లెటర్ తీసుకొని రావాలన్నారు. 14వతేదీ సాయంత్రం డిపో మేనేజర్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

అదనపు సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయాలని వినతి



జస్టిస్ కె.సురేష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ పరిధిలో కోర్టు కేసులు వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని, కేసుల సత్వర పరిష్కారానికి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు మంజూరు చేయాలని తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, కోశాధికారి ఈదా ఫరోత్‌బాబులు విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా న్యాయమూర్తుల సదస్సులో పాల్గొన్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలన న్యాయ మూర్తి, జస్టిస్ కె.సురేష్ రెడ్డికి సదస్సు అనంతరం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పగుచ్ఛం అందజేసి, ఆయా సమస్యలను జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.సురేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్.శ్రీదేవి ద్వారా ప్రతిపాదనలు పంపాలని, మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదులు యడవల్లి మణికంఠ తేజ ఉన్నారు.

వానా కాలం.. మూగజీవాలకు గడ్డు కాలం

- వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశు వైద్యులు



మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకలు

యలమంచిలి: మూగజీవాలకు వానా కాలంలో గడ్డు కాలంగా ఉంటుంది. ముఖ్యంగా గొర్రెలు, మేకలను ఆరుబయట ఉంచడంవల్ల కొన్నిరకాల వైరస్‌లు సోకి ఎక్కువగా వ్యాధుల బారిన పడుతుంటాయి. సకాలంలో వైద్యం అందించకపోతే చనిపోతుంటాయి. జిల్లాలో 5,35,276 గొర్రెలు, మేకలు ఉండగా వాటి ల్లో గొర్రెలు 4,19,314 మేకలు 1,15,962 ఉన్నాయి. జీవాల ఆరోగ్యం విషయంలో పెంపకందారులు అప్రమత్తంగాఉంటూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యులు సూచిస్తున్నారు. పోషణతో పాటు వాటి సంరక్షణపై దృష్టి సారించాలని వివరిస్తున్నారు. వాతావరణం చల్లగా ఉండటం, వర్షం కురవడంవల్ల శరీర స్థితి బాగా లేని గొర్రెలు, మేకలు ఈ కాలంలో తొందరగా వ్యాధుల బారిన పడతాయ ని చెబుతున్నారు. పారుడు, మశూచి, న్యుమోనియా, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, దోమలు, కీటకాల వల్ల తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది.

అపరిశుభ్రతతో న్యుమోనియా

జీవాలను ఆరుబయట ఉంచడం, పాకలు పరిశుభ్రంగా లేకపోవడం, దుమ్మూ ధూళితో నిండి ఉండడం, పాకల్లో పరిమితికి మించి ఎక్కువ సంఖ్యలో జీవాలను ఉంచడం, సరైన పోషణ లేకపోవడం వల్ల న్యుమోనియా సోకుతుంది. ఈ వ్యాధి బారిన పడిన జీవాల్లో దగ్గు, జ్వరం, ముక్కు కారడం ఎక్కువగా కనిపిస్తుంది. సరిగ్గా మేత మేయకపోవడం వల్ల జీవాలు నీరసించిపోతాయి. ఒకటి నుంచి తొమ్మిది నెలల వయసున్న గొర్రె, మేక పిల్లలు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడుతుంటాయి. మరణాలు కూడా ఎక్కువగా సంభవిస్తాయి. వ్యాధి నివారణకు గాలి, వెలుతురు బాగా వచ్చే పాకల్లో జీవాలను ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, శుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్నాకే మందలో కలపాలని వివరిస్తున్నారు.

మశూచి/బొబ్బ రోగం..

ఈ వ్యాధి వైరస్ వల్ల ప్రబలుతుంది. వ్యాధి బారిన పడిన మేతకు వెళ్తున్న గొర్రెలు, మేకల చర్మంపై బొబ్బలు కనిపిస్తాయి. తీవ్ర జ్వరం వచ్చి ముక్కు నుంచి నీరు కారుతుంది. శ్వాస సరిగ్గా తీసుకోలేక వేగంగా ఊపిరి పీల్చుతుంటాయి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరు చేసి చికిత్స అందించాలి. పుండ్లపై వేప నూనె లేదా పశు వైద్యులు సూచించిన మందులను పూయాలి.

నీలి నాలుక వ్యాధి

ప్రధానంగా ఈ వ్యాధి గొర్రెల్లో కనిపిస్తుంది. చీకటీగల ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. వర్షాకాలంలో చీకటీగలు ఎక్కువగా వృద్ధి చెందుతుంటాయి. గాలి ద్వారా ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి చేరి వ్యాధిని వ్యాపింపజేస్తాయి. ఈ వ్యాధి సోకిన గొర్రెల్లో అధిక జ్వరం, కళ్లు, ముక్కుల నుంచి నీరు కారుతుంది. నోరు, నాలిక వాచి నీలి రంగులోకి మారుతుంది. నోటిలో పుండ్లు ఏర్పడటం వల్ల జీవాలు ఆహారం తీసుకోవడానికి ఇబ్బంది పడతాయి. కాలి గిట్టలు, చర్మం కలిసే దగ్గర వాపు వచ్చి జీవాలు కుంటుతుంటాయి. వ్యాధి ముదిరితే మరణిస్తాయి. చీకటీగలను నివారించడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించవచ్చు. జీవాలు ఉండే పాకల దగ్గర మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలి. వ్యాధి బారిన పడిన జీవాలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించాలి.

తిక్క (సర్వ) రోగం..

వర్షా కాలంలో దోమలు, కీటకాల వల్ల గొర్రెలు, మేకలకు తిక్క (సర్వ) రోగం ఎక్కువగా వస్తుంది. వ్యాధిని త్వరగా గుర్తించకపోతే జీవాలు మృతి చెందే అవకాశం ఎక్కువ. పాకాల వద్ద సాయంత్రం పూట వేపాకు ధూపం వేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి.

సంరక్షణ చర్యలు తీసుకోవాలి



వర్షా కాలంలో సాధారణంగా గొర్రెలు, మేకలకు వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జీవాలు నీరసంగా ఉన్నా, మేత మేయకపోయినా అశ్రద్ధ చేయకుండా వెంటనే పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలి. వ్యాధులను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. పశు వైద్యుల సూచనలు మేరకు మందులు వాడుతూ సంరక్షణ జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి,
మండల పశు వైద్యాధికారి, యలమంచిలి

ముందుజాగ్రత్తతో ముప్పు నుంచి రక్షణ

- గొర్రెలు, మేకలనుఉంచే పాకల్లోకి చలిగాలి రాకుండా చర్యలుతీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
- జీవాలను వర్షంలో, ఆరుబయట ఉంచకూడదు.
- గడ్డిపై వర్షపు నీరు ఆరిన తర్వాత సూర్యరశ్మి వచ్చాక మేతకు విడిచి పెట్టాలి.
- ఈతకువచ్చిన గొర్రెలను శ్రద్ధగా పర్యవేక్షించాలి.
- శరీర ఉష్ణ నిర్వహణకు పీచు పదార్థంతో ఉండే మేతను అందించాలి
- గొర్రెలను, మేకలను కట్టే ప్రదేశాలను తరచూ మారుస్తూ ఉండాలి.
- మృతిచెందిన గొర్రెలు, మేకలు తిన్నగడ్డిని, ఆహా రాన్ని మిగతావాటికి వేయకుండా కాల్చివేయాలి.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు శనివారం మానవత సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. సంస్థ సౌజన్యంతో 30 మందికి పౌష్టికాహారంగా ఎనిమిది రకాల పప్పు దినుసులు, డ్రై ఫ్రూట్స్, పొన్నమండ గ్రామస్తుడు సూర్యనారాయణ రాజు సౌజన్యంతో భోజనం ప్యాకెట్లు, బి.అరుణ శ్రీ, లక్ష్మీ దంపతుల సౌజన్యంతో ట్రాన్స్‌పోర్ట్ మనీ అందించినట్లు సంస్థ అధ్యక్షుడు చింతల పాటి రామకృష్ణంరాజు, కో చైర్మన్ కారుమూరి నరసింహమూర్తి (బాబు), ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాసు తెలిపారు.